మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. నారాయణమూర్తి

అక్టోబరు 6న 'యూనివర్శిటీ'

విద్యారంగంపై ఆర్.నారాయణమూర్తి సినిమా ఆదరించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అక్టోబరు ఆరవ తేదీన 'యూనివర్శిటీ' సినిమాను విడుదల చేయనున్నట్టు సినీ నిర్మాత, దర్శకులు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయనతోపాటు కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, ప్రముఖ రచయిత శాంతినారాయణ, విశాలాంధ్ర బుక్‌హౌస్ ఇంఛార్జీ ఈశ్వరరెడ్డి, మానవతా రక్తదాతల సంస్థ నిర్వాహకులు తరిమెల అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ విద్య,వైద్యం రెండూ సేవారంగాలని చెప్పారు. అయితే ఈ రెండింటినీ వ్యాపారమయంగా మార్చేసారని విచారం వ్యక్తం చేశారు. ప్రధానంగా విద్యా రంగం వ్యాపారాత్మకంగా మారిందన్నారు. పుట్టగొడుగుల్లా ప్రయివేటు సంస్థలు పుట్టుకొస్తున్నాయన్నారు. వీటి మధ్య పోటీ కారణంగా అనేక పెడధోరణులు నెలకొంటున్నాయన్నారు. ఈ ఇతివృత్తంతోనే పరీక్షా పేపర్ల లీక్ ఆధారంగా 'యూనివర్శిటీ' సినిమాను రూపొందించినట్టు తెలిపారు. దీనికి ప్రజలందరూ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ విద్యారంగంలో ప్రయివేటీకరణ కారణంగా అనేక పెడధోరణలు నెలకొంటున్నాయన్నారు. విపరీతమైన పోటీల కారణంగా సంస్థలు అనేక అనైతిక మార్గాలను అనుసరిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. సమాజంలో నెలకొన్న అనేక రుగ్మతలకు వ్యతిరేకంగా సినిమాలను రూపొందించడంలో నారాయణమూర్తి ముందుంటారని అన్నారు. ఆయన తీసిన యూనివర్శిటీ సినిమాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ రచయిత శాంతి నారాయణ మాట్లాడుతూ నేడు విద్య వ్యాపారమయంగా మారిందన్నారు. ఈ ప్రయివేటు పోటీలో ఫలితాల వెంట అందరూ పరుగులు తీయాల్సి వస్తోందన్నారు. ముందున్నామని చెప్పుకునేందుకు ఈ ప్రయివేటు సంస్థలు అనేక రకాలైన వక్రమాలను అనుసరిస్తున్నాయన్నరు. తద్వారా కష్టపడి చదివిన విద్యార్థులు నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. దీని ఆధారంగా రూపొందించిన ఆర్.నారాయణమూర్తి సినిమాను ఆదరించాలని కోరారు.

తాగునీటి పథకాల కార్మికుల కష్టాలు కన్పించవా..?

అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న తాగునీటి పథకం కార్మికులు

ఆరునెలలుగా అందని వేతనాలు
నిరవధిక సమ్మె చేస్తున్నా నిద్రలేవని పాలకులు
కార్మికులపై బెదిరింపులకు దిగుతున్న అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

దాహం తీర్చే కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు అందక...జీవనం కష్టంగా మారడంతో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు నీటి సరఫరా కార్మికులు ఆందోళనలు చేపట్టారు. కార్మికుల సమస్యలను పాలకులు, అధికారులు పరిష్కరించక పోవడంతో అటు శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్, ఇటు సత్య సాయి వాటర్ వర్క్స్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. అయినప్పటికీ తమకు ఏమి పట్టనట్లు అటు పాలకులు, ఇటు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీరి నిర్లక్ష్యంతో కార్మికుల కుటుంబాలు గత ఆరు నెలలుగా ఆకలితో అలమటిస్తున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతి పెద్ద నీటి ప్రాజెక్టులు శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్, సత్య సాయి వాటర్ వర్క్స్ ప్రాజెక్టులు. ఈ ప్రాజెక్టుల ద్వారా వందలాది గ్రామాలకు వందలాది మంది కార్మికులు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సాధారణంగా దాహం వేసినప్పుడు ఒక గ్లాసు నీరు ఇచ్చిన వారిపట్ల కృతజ్ఞతా భావం చూపిస్తాం. అలాంటిది కొన్ని ఏళ్లుగా వందలాది గ్రామాలలో, వేలాది మంది ప్రజల దాహార్తిని తీరుస్తున్న సత్యసాయి వాటర్ వర్క్స్, శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ కార్మికులు ప్రస్తుతం ఆకలికేకలతో అలమటిస్తుంటే పట్టించుకునే అధికారులు, పాలకులు కరువయ్యారు. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు అని అధికారులు చెబుతున్నారు. అయితే కార్మికుల ఆకలి కేకలను నివారించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అధికారులు చేయడం లేదు. 1998 నుంచి అనంతపురం ఉమ్మడి జిల్లాలో వందలాది గ్రామాలకు సత్యసాయి తాగునీటి పథకం ద్వారా నీటి సరఫరాను చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 572 మంది కార్మికులు వివిధ కేటగిరీల కింద పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఏడు జోన్లు ఉన్నాయి. అందులో అనంతపురం, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తి, ధర్మవరం, ముదిగుబ్బ జోన్లు ఉన్నాయి. అనంతపురం జోన్‌లో 6 పంప్ హౌస్‌ల ద్వారా 31 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. పుట్టపర్తి జోన్‌లో 9 పంపు హౌసులు ఉండగా 40 నుంచి 50 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. ధర్మవరంలో 9 పంప్ హౌస్‌లు ఉండగా 78 గ్రామాలకు, ముదిగుబ్బ జోన్ 8 పంప్ హౌస్ లు ఉండగా 116 గ్రామాలకు, కళ్యాణదుర్గం జోన్‌లో 10 పంప్ హౌస్ లో ఉండగా 80 గ్రామాలకు, గుత్తి జోన్‌లో 9 పంప్ హౌస్ లో ఉండగా 15 గ్రామాలకు, తాడిపత్రిలో జోన్‌లో 12 పంప్ హౌస్ ఉండగా 91 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాగా ఇది వరకు సత్య సాయి తాగునీటి సరఫరాకు సంబంధించి ఒక బోర్డు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేస్తూ ప్రత్యేకంగా ఒక ఎస్ఇ, డిఇ ఈ స్థాయి అధికారులను సైతం బోర్డుకు నియమించారు. ఇదివరకు రోజుకు కోటి లీటర్ల నీటిని పంపింగ్ చేసి, గ్రామాలకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం కేవలం 30 లక్షల లీటర్ల మాత్రమే పంపింగ్ చేస్తూ నీరు సరఫరా సాగిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా నీటి పంపింగ్ యంత్రాలను వినియోగించిన కారణంగా అత్యధిక శాతం పంపులు మరమ్మతుకు గురై పనిచేయని కారణంగా పంపింగ్ చాలా వరకు తగ్గిపోయింది. దీంతో ఆ వచ్చే అరకొర నీటిని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కాగా నీటి సరఫరాకు ఒక్కొక్క పంప్ హౌస్ దగ్గర పంపు ఆపరేటర్, రిగ్గర్, పంపింగ్ హెల్పర్, విలేజ్ ఆపరేటర్ అదేవిధంగా నైట్ సెక్యూరిటీల పేరుతో వారి వారి స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. 2021 వరకు అప్పటి ప్రభుత్వాలు నామినేషన్ పద్ధతిలో వాటి నిర్వహణను ఎల్ అండ్ టి సంస్థకు అప్పగించేవారు. దీంతో వారు సత్యసాయి నీటి సరఫరా పథకానికి సంబంధించి బాధ్యతలు తీసుకొని నడిపేవారు. నిధుల సమస్య కారణంగా ఎల్ అండ్ టి వారు సత్యసాయి బోర్డుకు పూర్తి ప్రాజెక్టు స్వాధీనం చేసి తప్పుకున్నారు. అప్పగించే సమయంలో కార్మికులకు సంబంధించిన గ్రాడ్యుటి సొమ్మును సుమారు రూ.32 కోట్ల వరకు బోర్డుకే అప్పగించారు. సదరు గ్రాడ్యుటీ సొమ్మును కార్మికులకు చెల్లించాలని ఎల్ అండ్ టీ కోరగా ఆమేరకు అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అదే విధంగా ఎస్ఇ, డిఇలు ఒక ఒప్పందం చేసుకొని రాతపూర్వకంగా కూడా రాసి ఇచ్చినట్లు సమాచారం. అయితే ఎల్ అండ్ టి వారు తప్పుకున్నప్పటి నుంచి అడపాదడపా వేతనాలు ఇస్తూ వస్తున్నారని, పది నెలల పిఎఫ్, 18 నెలల ఈఎస్ఐ కి సంబంధించిన చెల్లింపులు అసలు జరగడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఇక రెండు మూడు నెలలుగా రాష్ట్ర మంత్రులకు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులకు, ఇతర ఉన్నతాధికారులకు పలుమార్లు వినతి పత్రం అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని కార్మికులు, కార్మిక సంఘ నాయకులు అంటున్నారు. తమ సమస్యలకు పరిష్కారం చూపని కారణంగా చేసేదిలేక ఈనెల 24వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నామని ప్రకటించి, కార్మికులందరు సమ్మెలోకి వెళ్లారు. అయితే విషయంపై అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు నిలిపివేయడం జరిగిందని. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నుంచి ఆదేశాలు అందాయని అంటున్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ, పట్టణ ప్రాంతంలో పురపాలక శాఖ నుంచే నిధులు వసూలు చేసుకుని కార్మికుల వేతనాలు, మోటార్ల మరమ్మతులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇచ్చిన ఆదేశాలలో పేర్కొన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరి ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి పంచాయతీరాజ్, పురపాలక సంఘాల నుంచి నిధుల వసూలు సాధ్యమయ్యేనా, కార్మికుల ఆకలి కేకలు తీరేనా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఇక శ్రీ రామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 750 గ్రామాలకు నీటిసరఫరా జరుగుతూంది. గత 14 సంవత్సరాలుగా రాయదుర్గం, కల్యాణదుర్గం, ఉరవకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లోని గ్రామాలకు లైన్మెన్, ఆపరేటర్, హెల్పర్లు, గ్యాంగ్‌మెన్‌లు ఇలా 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరికి 4 నెలలుగా వేతనాలు, 9 నెలల ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటిని చెల్లించాలని డిమాండ్ చేస్తు ఈ నెల 1వ తేదీ నుంచి 19తేదీ వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు కార్మికులు రిలేదీక్షలు చేపట్టారు. ప్రభుత్వం స్పందించక పోవడంతో వీరు సైతం సమ్మెలోకి వెళ్లారు. మడకశిర నియోజకవర్గంలో గుత్తేదారుడు కలాంనాయుడు కార్మికులకు ఇవ్వవలసిన వేతనాలలో ప్రతి కార్మికుని నుండి రూ.3 వేలు వేతనాలలో కోత విధించి ఇస్తున్నారనిఇదేమని ప్రశ్నించే కార్మికులను స్థానిక ప్రజాప్రతినిధి వత్తాసుతో భయపెట్టి కార్మికుల శ్రమను నిలువునా దోచుకుంటున్నారని కార్మికులు విమర్శిస్తున్నారు. గత సంవత్సరంగా కార్మికులకు పి.ఎఫ్ బకాయిలు, వేతనాలు బకాయిలు చెల్లించాల్సుంది. హిందూపురం నియోజకవర్గంలో ఎ.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ అండ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ ఉంది. అయితే పుట్టపర్తి అధికార పార్టీ ఎమ్మెల్యేకి బినామిగా ఉన్నా గుత్తేదారుడు గోవర్ధన్ రెడ్డి సైతం కార్మికులకు ఇవ్వవలసిన వేతనాలలో రూ. 3వేలు కోతకోసి కార్మికులకు పి.ఎఫ్. చెల్లించకుండా అధికార పార్టీ అండతో ప్రశ్నించిన కార్మికులను తొలగిస్తామని భయపెట్టడం, ఇచ్చినపుడే వేతనాలు తీసుకోవాలని హుకుం జారీ చేయడం లాంటివి చేస్తున్నారు. ఇది తెలిసినప్పటికి కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కార్మికులకు చెల్లిస్తున్న వేతనాల్లో 13శాతం గుత్తేదారులకు కమీషన్ ప్రభుత్వం చెల్లిస్తుంది. అయినప్పటికి గుత్తేదారులు కార్మికులను నిలువునా దోచుకుని వేతనాలు సైతం ఇవ్వకుండా నేడు రోడ్డున పడేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 1500 మంది కార్మికులు వేతనాల కోసం నిరవధిక సమ్మె చేస్తున్నా అటు పాలకులు, ఇటు అధికారుల్లో కనీస స్పందనకనిపించడం లేదు.

న్యాయం చేసే వరకు సమ్మె విరమించేది లేదు

గ్రామీణ, పట్టణ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న కార్మికులకు న్యాయం జరిగే వరకు సమ్మె విరమించే ప్రసక్తేలేదు. ప్రభుత్వం కార్మికులకు ఇస్తున్న వేతనాల్లో కొంత మంది కాంట్రాక్టర్లు కోత విధించి అడ్డంగా దోచుకుంటున్నారు. ఆ డబ్బులు సైతం కార్మికులకు గుత్తేదారులు ఇవ్వాలి.

జి ఓబులు
వాటర్ సప్లై కాంట్రాక్టు కార్మికుల స్టేట్ కన్వీనర్

ఆందోళనలు తీవ్రతరం చేస్తాం

నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తాం. ఇస్తున్న వేతనాలు సక్రమంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికి పాలకులు పట్టించుకోవడం లేదు. ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలకు ఎలా బటన్ నొక్కుతారో అదే విధంగా కార్మికుల వేతనాలకు బటన్ నొక్కాలి. లేని పక్షంలో 2024 ఎన్నికల్లో బటన్ ఎవరి నొక్కాలో కార్మికులకు తెలుసు.

ఈఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా కార్యదర్శి

కార్మికుల సమ్మెను అడ్డుకునేందుకు అధికారుల యత్నం

అధికారులతో మాట్లాడుతున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికుల నిరవధిక సమ్మెను ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పోలీసులు బలవంతంగా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రధాన పంపు మోటార్లను పోలీసులు బలవంతంగా ఆన్ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ శ్రీరామ్ రెడ్డి కార్మికులు, సిఐటియు నాయకులు నిరసన వ్యక్తం చేసి మోటార్లను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ బకాయి వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలు, గ్రాడ్యుటీ చెల్లించాలని అనేకమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా, శాంతియుత నిరసనలు చేపట్టిన, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. ప్రజలకు ఇబ్బంది కలగకూడదని ఇన్ని రోజులు వేతనాలు అందకపోయినా సమస్యలు ఎదుర్కొని కార్మికులు పనిచేస్తూ వచ్చారన్నారు. నెలలు తరబడి వేతనాలు రాకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రభుత్వం ఆలోచించాలన్నారు. గత్యంతరం లేని సమయంలో కార్మికులు నిరోధిక సమ్మెకు దిగాల్సి వచ్చింది అన్నారు. ప్రభుత్వం, అధికారులు కార్మికుల పక్షాన స్పందించి సమస్యలు పరిష్కరించాల్సింది పోయి సమ్మె విరమింపజేసే విధంగా కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తక్షణమే బకాయి వేతనాలు ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలా కాకుండా బలవంతంగా సమ్మె నిలుపుదల చేస్తామంటే సిఐటియుగా ఒప్పుకునేది లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాలు ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రధాన పంపు మోటార్లను ఆన్ చేసిన అధికారులు
ప్రతిఘటించిన కార్మికులు, నాయకులు

వైఫల్యం విజయానికి సోపానం అవ్వాలి

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఆరోగ్యకరమైన వాతావరణంలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) స్పోర్ట్ ఫర్ డెవలప్మెంట్ సెక్టార్ ద్వారా నిర్వహిస్తున్న గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ – 2023 కేంద్ర స్థాయి పోటీలు అనంతపురం క్రీడా గ్రామం (ఎఎస్)లో ఆదివారం ప్రారంభించారు. ముందుగా మార్చి ఫాస్ట్, టార్చ్ రన్ తో కార్యక్రమం మొదలయ్యింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ గౌతమి ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, స్పోర్ట్స్ ఫర్ డవల్‌మెంట్ డైరెక్టర్ సాయికృష్ణ పుల్లూరు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ నిర్వహించడం ఎంతో మంచి పరిణామన్నారు. విద్య, ఆరోగ్యం, హౌసింగ్, గ్రామీణుల్లో నైపుణ్యాలను వెలికి తీయడం లాంటి అనేక రకాల మంచి కార్యక్రమాలను ఆర్డీటీ చేపడుతోందని, అదే విధంగా ఎన్నో రకాల సేవలు చేస్తోందని అన్నారు. గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ పోటీలలో వివిధ స్థాయిల్లో 3వేల మంది వరకు బాలికలు పోటీ చేయడం జరిగిందని, అక్కడ గెలిచిన 350 మందిని జిల్లా స్థాయిలో పోటీలకు తీసుకురావడం జరిగిందని అన్నారు. వారికి మంచి సదుపాయాలను కల్పించారన్నారు. గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. బాలికల పోటీలను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. గ్రామీణ బాలికల్లో నైపుణ్యాలను గుర్తించడం, వారికి మంచి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడం, వారిని విజయవంతం చేయడం అనేది ఈ మధ్యకాలంలో గొప్ప మార్పు అన్నారు. బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో ఆరోగ్యవంతంగా పోటీపడాలని, అది గెలవడం గురించి కాదని, ఇది ప్రతి క్షణం ప్రయత్నించడం, ఆనందించడం గురించి అని అన్నారు. ఓటమిని కూడా ఆనందించాలని, వైఫల్యాలు విజయానికి సోపానాలు అని అన్నారు. బాలికలు భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని, వారు ఎంచుకున్న రంగంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 27 నుండి 29 వరకు మూడు రోజులు పాటు క్రీడా పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్ మాట్లాడుతూ ఆడపిల్లలను క్రీడల్లో ప్రోత్సహించడానికి గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు, పాఠశాలలు ఆడపిల్లలను క్రీడల్లో పోటీపడేలా ప్రోత్సహించడం మనం చూస్తున్నామని, ఇప్పటికే క్రీడల్లో ఆడపిల్లలు గొప్పగా రాణించడం మనం చూశామని, మరింత మంది బాలికలు క్రీడలలో రాణించడం చూడాలని తమ ఆశిస్తున్నామని అన్నారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి 6 విభాగాల్లో 38 ప్రాంతాల నుంచి 350 మంది బాలికలు కేంద్ర స్థాయి పోటీలలో పాల్గొంటున్నారని చెప్పారు. ఆరు సంవత్సరాల విరామం తర్వాత పున్నప్రారంభమైన గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ మీట్, గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాల బాలికల నైపుణ్యాలను ప్రదర్శించడానికి, క్రీడలపై ఆసక్తిని పెంపొందించడానికి, అలాగే క్రీడలలో బాలికల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ఈ వేదికను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

రాయలసీమంటే ఫ్యాక్షనే కాదు.. గొప్ప సంస్కృతి

తెలుగు మౌఖిక సాహిత్య పరిశోధకులు స.వెం.రమేష్

సమావేశంలో మాట్లాడుతున్న రచయిత రమేష్

ప్రజాశక్తి-అనంతపురం

రాయలసీమంటే కరువు, ఫ్యాక్షనిజమే కాదు.. ఇక్కడి సంస్కృతి ఎంతో గొప్పదని తెలుగు మౌఖిక సాహిత్య పరిశోధకులు, రచయిత స.వెం.రమేష్ పేర్కొన్నారు. రాయలసీమ జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగరంలోరి ఆర్ట్సు కళాశాల డ్రామాహాలులో రాయలసీమ సంస్కృతిపై సమాలోచన సదస్సు జరిగింది. ఎస్కేయు ప్రొఫెసర్ సదాశివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమాఆలోచన కార్యక్రమానికి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమంటే ఇప్పుడు మనం చూస్తున్న కొన్ని జిల్లాలు మాత్రమే కాదని అన్నారు. విస్తీర్ణం చాలా పెద్దది అని చెప్పారు. ఎంతో ప్రాచీన వైభవం కలిగినదని తెలిపారు. ఈ సంస్కతిని ప్రపంచానికి చాటాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాయలసీమ అంటే ఫ్యాక్షన్, కరువులే అన్న అపోహ ఉందన్నారు. ఆ అపోహన పోగొట్టి ఇక్కడి సంస్కృతిని రాబోయే తరాలకు తెలియజేసే విధంగా కృషి చేయాల్సిన అవసరముందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కిన్నెర జోగుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్, కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, కవులు రచయిత షేక్ నబీ రసూల్, వంద టిఎంసిల రామాంజినేయులు, చిలకూరి దీవెన, అన్నమ్మ, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతి ఎవరికోసం ?

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి పౌరస్మృతి ఎవరికోసం అన్న అంశంపై మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మావన హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు సుబ్బన్న అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ భారతదేశంలోనున్న చట్టాల పరిణామంపై వివరించారు. అదే విధంగా ఇప్పుడున్న చట్టాల్లో ఉమ్మడిగానున్న చట్టాల గురించి వివరించారు. ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొస్తామన్న పేరుతో అధికార బిజెపి చేస్తున్న హడావుడి వలన జరిగే ప్రయోజనమెంత అన్న దానిపైనా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉభయ రాష్ట్రా సమన్వయకర్త చంద్రశేఖర్, సభ్యులు ఇక్బాల్, నరసింహామూర్తి, సత్యంబాబు, మల్లికార్జున,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సదస్సు

జిల్లాలో 64,029 గృహ నిర్మాణాలు లక్ష్యం

జిల్లా హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లాలో ఈ ఏడాది డిసెంబర్ ఆఖరుకు 64,029 గృహాలు నిర్మించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళిరెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30న సుమారు 5 లక్షల సామూహిక గృహప్రవేశాలు లబ్ధిదారులతో చేయించాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీలు నిర్మించాలన్నది ప్రభుత్వం లక్ష్యం కాగా ఈనెల 30న సామూహిక గృహప్రవేశాలు చేపట్టామన్నారు. నియోజకవర్గానికి ఒక లేఅవుట్ లో నిర్మించిన జగనన్న కాలనీలను ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించనున్నారు. సత్యసాయి జిల్లాలో నిర్మించిన గృహాలను ప్రారంభించనున్న సందర్భంగా జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళి రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని గృహాలు నిర్మిస్తున్నారు?

జవాబు : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది డిసెంబర్ ఆఖరికి 64,029 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఉన్నత అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు ఇప్పటికీ 15,451 గృహాలు నిర్మించాలన్న లక్ష్యాన్ని పూర్తి చేశాం. మిగతావి ఈ ఏడాది ఆఖరుకు పూర్తి చేస్తాము.

ప్ర: ఈనెల 30న ఎక్కడ ప్రారంభించనున్నారు.?

జ : ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల గృహాలను ప్రభుత్వం ప్రారంభించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతి నుంచి ప్రారంభించనున్నారు. అదే రోజు అన్ని జిల్లాలలోను పూర్తి అయిన గృహాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించనున్నారు. సత్యసాయి జిల్లాలో గోరంట్ల మండలం లోని మల్లాపల్లి లేఅవుట్లో పూర్తి అయిన 247 గృహాలను ప్రారంభించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆ కాలనీలో రహదారులు, విద్యుత్, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలను కల్పించాం. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ తదితర అధికారులు పాల్గొననున్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారులు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు 15,451 గృహాలు జిల్లా వ్యాప్తంగా పూర్తి అయ్యాయి.

చంద్రమౌళిరెడ్డి

ప్ర: వివిధ దశల్లో నిర్మాణంలో ఎన్ని గృహాలు ఉన్నాయి.?

జ : బిపిఎల్ క్రింద 21,339, బేస్మెంట్ లెవెల్ క్రింద 4,539, మూత వేసినవి 1624, పూర్తి అయినవి 14,411 గృహాలు ఉన్నాయి. ఇంకా మొదలు కానివి 4859 ఉన్నాయి. వచ్చే డిసెంబర్ నాటికి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: ఒక్కో గృహానికి ప్రభుత్వం ఎంత ఇస్తుంది? ఆ మొత్తం సరిపోతుందంటారా.?

జ : ప్రభుత్వం ఒక్కొక్క గృహానికి రూ. 1.80 లక్షలు ఇస్తోంది. ఇది కాక స్వయం సహాయక సంఘాల ద్వారా 25 వేల రూపాయలు, మరో 20 వేలు బ్యాంకు రుణం మొత్తం కలిపి రూ.2.25 లక్షలతో నిర్మాణం చేసుకోవచ్చు. లబ్ధిదారులు కొంత మొత్తం కలుపుకుంటే మరింత బాగా నిర్మించుకోవచ్చు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మంజూరు చేస్తున్న మొత్తం సరిపోతుంది. లబ్ధిదారులైన నిర్మించుకోవచ్చు, లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏజెన్సీ ద్వారా అయినా నిర్మించుకోవచ్చు.

ప్ర: జిల్లా ప్రజలకు మీరిచ్చే సూచనలు సలహాలు ఏమిటి.?

జ : ఇల్లు లేని పేదవారి సొంతింటికల నెరవేర్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. ఆ కల నెరవేర్చుకోవడానికి లబ్ధిదారులు ముందుకు వచ్చి గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి. ఇదొక బృహత్తర పథకం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

పూర్వ విద్యార్థుల ప్రోత్సాహంతో మరింత అభివృద్ధి

విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలి - జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

పూర్వ విద్యార్థుల సహాయ, సహకారాలతో జెఎన్‌టియు కళాశాలను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లనున్నట్లు జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన తెలిపారు. ఆదివారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల (1994-1998) ఎఫ్‌డిహెచ్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు కళాశాలను సందర్శించారు. ఇందులో భాగంగా మెకానికల్ సెమినార్ హాలులో వివిధ ఆన్‌లైన్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఇలాంటి సమావేశాల వల్ల పూర్వ విద్యార్థులతో మిత్రులను కలిసే అవకాశం కలుగుతుందన్నారు. ముఖ్యంగా పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని తెలిపారు. రాబోవు కాలంలో కూడా పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లనున్నట్లు వివరించారు. అలాగే పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలని పిలుపునిచ్చారు. రెక్టార్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు పూర్వ విద్యార్థుల సహకారం ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఎన్నో గొప్ప పదవులను అలంకరించారన్నారు. రిజిస్ట్రార్ సి.శశిధర్ మాట్లాడుతూ అల్యూమిని అసోసియేషన్ కళాశాలకు బలం అన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిలో అల్యూమిని సభ్యుల సలహాలు, సూచనలు ఎప్పుడూ చాలా అవసరం అవుతాయన్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు ఇతర దేశాల్లో ఉద్యోగం చేయడం వల్ల కళాశాలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు 1994-1998 ఎఫ్‌డిహెచ్ బ్యాచ్ విద్యార్థులు ఎం.హరినాథ్‌రెడ్డి, శివరామిరెడ్డి (లండన్), ఎం.నాగమణి, (హైదరాబాద్ యూనివర్సిటీ), ఓబుళరెడ్డి (మైక్రో సాఫ్ట్ కంపెనీ పూణే) ఎం.మోహనోహర్‌రెడ్డి (బ్రేక్ ఇన్స్‌పెక్టర్), డి.శ్రీనివాసులు, బాలకృష్ణ, యూనివర్సిటీ ఫారెన్ అఫైర్స్ అండ్ అల్యూమిని మ్యాటర్స్ డైరెక్టర్ పి.సుజాత, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, అరుణ మస్తాని, ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, ఎం.అంకారావు, కళ్యాణి రాధా, మాజీ ఆచార్యులు డి.సాయిబాబారెడ్డి, వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

ఏ-1 చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సౌజన్యంతో అనంతపురంలోని కెఎస్‌ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-15 ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌పిప్-2023 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజర్ శ్రవణ్‌కుమార్, ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, ఛైర్మన్ బాలరాజు మాట్లాడుతూ స్విస్ లీగ్ పద్ధతిలో 8 రౌండ్ల పోటీలు నిర్వహించగా 8/8 పాయింట్లతో చాంపియన్‌షిప్ టైటిల్‌ను ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడకు చెందిన ఫిడే మాస్టర్ ఎం.డి. ఇమ్రాన్ (క్లాసికల్ రేటింగ్ 2197) సాధించినట్లు తెలిపారు. అలాగే రన్నరప్‌గా అనంతపురం జిల్లాకు చెందిన శామ్యూల్ స్టీఫెన్, 3వ స్థానం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మజ్జి రామ్‌చరణ్‌తేజ, 4వ స్థానం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీతసాగర్ కోనపర్తి, 5వ స్థానం కాకినాడ జిల్లాకు చెందిన యశస్వి సత్య గంగాధర్, 6వ స్థానం బాపట్ల జిల్లాకు చెందిన తల్లా నిశ్చల్, 7వ స్థానం అనంతపురం జిల్లాకు చెందిన యం.పి. సహృద్, సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకరయ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి భరత్, జీవన్‌కుమార్, డాక్టర్ సుప్రజాచౌదరి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్, ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఉదయ్‌కుమార్ నాయుడు, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్, శ్రీసత్యసాయి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి నాగార్జున కర్ణాటకమ్, తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు

లక్కీ-9 తాడిపత్రి దమ్ బిర్యానీ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో గంగాగౌరీ థియేటర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ-9 తాడిపత్రి ధమ్ బిర్యానీ ఫ్యామిలీ రెస్టారెంట్ 5వ బ్రాంచిని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయనతోపాటు తాడిపత్రి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండాపురం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురం ఉమ్మడి జిల్లా ప్రజల ఆదరణతో లక్కీ-9 తాడిపత్రి ధమ్ ఫ్యామిలీ బిర్యానీ రెస్టారెంట్ అంచలంచలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇందులో భాగంగానే 5వ బ్రాంచిని అనంతపురం నగర నడిబొడ్డున ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. రాయలసీమ స్థాయిలో సుమారుగా పదివేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎక్కడా లేని విధంగా రెస్టారెంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం 360 మంది కూర్చునే విధంగా తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రెస్టారెంట్‌లో అత్యాధునిక హంగులతో ఫ్యామిలీ లాంజ్, ప్యూర్ వెజ్ లాంజ్ కాంటినెంటల్ లాంజ్ విఐపి లాంజ్ ప్రత్యేక విభాగాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా వందమంది కూర్చునే విధంగా ఆధునిక సౌకర్యాలతో కాన్ఫరెన్స్ హాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం 99 వెరైటీ బిర్యానీలను అందిస్తున్నట్లు వివరించారు. త్వరలో కర్నూలు, తిరుపతి ప్రాంతాల్లో కూడా రెస్టారెంట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తమ పూర్తి పర్యవేక్షణలో 9 రెస్టారెంట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

నేడు విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినం

ప్రజాశక్తి-అనంతపురం

బషీరాబాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారికి గుర్తుగా విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు అనంతపురంలోని టవర్‌క్లాక్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో అమరులకు నివాళులర్పించినట్లు తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా 23 సంవత్సరాల క్రితం విద్యుత్ రంగంలో చేపట్టిన సంస్కరణలు రాష్ట్ర ప్రజలపై పెనుబారాలు వేస్తున్నాయన్నారు. వీటిని వామపక్ష పార్టీలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయన్నారు. ఇందులో భాగంగానే బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమం నిర్వహించినట్లు తెలిపారు.

ఈ ఉద్యమంలో ముగ్గురు అమరులయ్యారని గుర్తు చేశారు. నాటి పోరాట ఫలితంగా దశాబ్దానికిపైగా విద్యుత్ ఛార్జీలు పెరగకుండా ఆపగలిగామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పేర్లతో ప్రజలపై వేలకోట్ల విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

వైఎస్‌ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు బత్తల కోదండరామిరెడ్డి

మడకశిర ప్రజాశక్తి రూరల్

కార్మికు సంక్షేమమే లక్ష్యంగా గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నానని వైయస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ యూనియన్ నాయకుడిగా తాను చేసిన కృషిని వివరించారు. 1970 జనవరి 26వ తేదీన బత్తులల వెంకట్రాంరెడ్డి వెంకటలక్ష్మి మూడవ సంతానమైన కోదండరామిరెడ్డి అనంతపురం జిల్లాలో మూడు దశాబ్దాలుగా ఐఎన్టీయూసీకి ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ జిల్లా కార్యదర్శిగా జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐఎన్‌టియుసి కమిటీ ప్రధాన కార్యదర్శి హోదాలో పనిచేస్తూ వేలాది మంది ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. గత 35 సంవత్సరాల నుంచి కార్మిక నాయకునిగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడారు. కోదండరామిరెడ్డి అనంతపురం జిల్లాలో ఐఎన్టీయూసీని బలోపేతం చేసిన వ్యక్తులలో మొదటివాడిగా పరిగణింపబడుతున్నారు. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో జన్మించిన కోదండరామిరెడ్డి 20 సంవత్సరం వయసులోనే కార్మిక నాయకుడిగా గుర్తింపుపొందాడు. జిల్లా ఐఎన్టీయూసీ కమిటీ కార్యదర్శిగా 1992 సంవత్సరంలో అప్పటి జిల్లా అధ్యక్షులు కల్లికుల్లా ఖాన్ నియమించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా 2002లో ఎంపికయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను విభజించినప్పుడు రాష్ట్ర ఎన్ టి సి కమిటీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసి వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ పార్టీని అనంతపురంలో స్థాపించారు. ప్రస్తుతం వైయస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకునిగా ఉంటూ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అనుబంధ సంస్థ ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉద్యోగులతో ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాడు. కోదండరాం రెడ్డి గ్రంథాలయ ఉద్యమ అభివృద్ధికై విశేష సేవలు చేశారు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న తెలుగు యువత అధికార ప్రతినిధి దండ్రు శ్రీనివాసులు

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని గురుగుంట్ల గ్రామంలో మృతిచెందిన టిడిపి కార్యకర్త హరిజన ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందడంతో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు నివాళులర్పించారు. ఇందులో భాగంగా మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబానికి భరోసా కల్పించడంతోపాటు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో బాలన్న, దాసరి గంగాధర్, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బండి పరశురాం, బిసి సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, డైవయత్నం, ప్రసాద్‌నాయక్, లింగామయ్య, రత్నమయ్య, వెంకటన్న, శివయ్య, ఓబులేసు, మారుతీ, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలోకి చేరిన వారితో గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

పలువురు వైసీపీలో చేరిక

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఆదివారం వైసీపీలో చేరారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, కరిడికొండ గ్రామ సర్పంచి కర్ణకంట రమేష్‌నాయుడు సమక్షంలో టిడిపి నాయకుడు ముగ్గ చిక్కాల జమ్మన్న ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు, ఎమ్మెల్యే వైవిఆర్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడడం పట్ల వైసిపికి ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు మున్సిపల్ మాజీ ఛైర్మన్ జింకల రామాంజనేయులు, చిక్కాల పుల్లయ్య, తాటికొండ లక్ష్మన్న, రామాంజనేయ, పెద్ద బాలయ్య, టి.బాలయ్య, లక్ష్మన్న, టి. లక్ష్మయ్య రామాంజనేయులు, ఎ.జాషువా, టి.మహేష్, టి.విజయ్, టి.బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

జెవివి నూతన కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం : పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాయదుర్గం శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జి.సత్యనారాయణ, పి.ఆయూబ్‌ఖాన్, అధ్యక్షులుగా ఎంజి.వీరన్న, కార్యదర్శిగా సి.జగదీష్, ఉప అధ్యక్షులుగా జి.పరమేష్, జాయింట్ సెక్రటరీగా కె.సిద్ధప్ప, యూత్ కన్వీనర్ కె.రాఘవేంద్ర, సోషియల్ మీడియా ఇన్‌ఛార్జిగా కె.మారెన్న, గుమ్మగట్ట అధ్యక్షులుగా జి.మాంతేష్, కనేకల్ శాఖ అధ్యక్షులుగా జె.రాజేష్‌ను ఎన్నుకున్నారు.

నియోజకవర్గ ఆప్ అధ్యక్షులుగా వెంకటరమణ

రాయదుర్గం : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నియోజకవర్గ అధ్యక్షులుగా బొమ్మిశెట్టి వెంకటరమణ (బాబు)ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమేష్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంతం లేకుండా పనిచేస్తానని తెలిపారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఐదు నామినేషన్లు

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ నూతన స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు చేసిన వారిలో లీలావతి, రాజేశ్వరి, శేఖర్‌బాబు, రామాంజనేయులు, అబుసాలే ఉన్నారు. సోమవారం నామినేషన్లు పరిశీలించి సాయంకాలం నాలుగు గంటల తర్వాత పోటీ చేసే తుది జాబితాను ప్రకటించనున్నారు.

ఎస్‌ఆర్‌కె మైండ్ కేర్ ఆసుపత్రి ప్రారంభం

అనంతపురం : నగరంలోని సాయినగర్ 6వక్రాస్‌లో కేశవరెడ్డి స్కూల్ ఎదురుగా నూతనంగా నిర్మించిన ఎస్‌ఆర్‌కె మైండ్ కేర్ ఆసుపత్రిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అధినేత డాక్టర్ గరుగు బాలాజీ మాట్లాడుతూ అన్ని రకాల మానసిక రుగ్మతలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో ఫిజీషియన్ డాక్టర్ అజయ్ కుమార్, జనరల్ సర్జన్ డాక్టర్ మధుసూదన్, ఇఎన్‌టి డాక్టర్ కుసుమ, గైనకాలజిస్ట్ డాక్టర్ చైతన్య ప్రజలకు అందుబాటులో ఉంటారని వివరించారు.

'బ్లాక్ స్పాట్స్' గుర్తింపు

గార్లదిన్నె: మండల కేంద్రంతోపాటు రాందాస్‌పేట, కల్లూరు వరకూ ఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం పర్యటించి బ్లాక్‌స్పాట్‌ను గుర్తించారు. అలాగే మండల పరిధిలోని రాందాస్‌పేట వద్ద 44వ జాతీయ రహదారిపై ఎస్‌ఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి చెందిన రూ.1కోట్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడం తెలిసిందే. వీటిపై విచారించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల పరిధిలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. ఘటన జరిగిన రోజు బ్లాక్ ఇన్నోవా వాహనం శింగనమల నుంచి తాడిపత్రి వైపు వెళ్లడం గుర్తించినట్లు తెలుసుకుని ఆ దిశగా విచారణ చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల : మండలంలోని ఆనందరావుపేటకు చెందిన గువ్వల లక్ష్మీదేవి, ఆదెప్ప కుమార్తె జోష్న వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాసులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం అందించడం ఎంతో సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో గువ్వల భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న తెలుగు యువత అధికార ప్రతినిధి దండ్రు శ్రీనివాసులు

కృష్ణుని ఆలయానికి చిత్రపటం వితరణ

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయానికి బెంగళూరుకు చెందిన నంజుండయ్య శ్రీకృష్ణుని చిత్రపటాన్ని విరాళంగా అందజేశారు. ఈ చిత్రపటం విలువ సుమారు రూ.20వేలు విలువ ఉన్నట్లు తెలిపారు. అనంతరం అర్చకులు నంజుండయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు, మాజీ కౌన్సిలర్ కోనేటి గోవిందు, యాదవ్ సంక్షేమ సంఘం నాయకుడు ఏకాంతమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకులకు శ్రీకృష్ణ చిత్రపటాన్ని అందజేస్తున్న నంజుండయ్య

కలెక్టర్, ఎస్పీని కలిసిన టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్

ప్రజాశక్తి-అనంతపురం

కలెక్టర్ గౌతమిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావునిపట్టణంలో నూతనంగా ఎంపికైన టిటిడి (తిరుమల తిరుపతి దేవస్థానం) బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరికీ పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గిరిజనుడిని టిటిడి బోర్డు సభ్యుడిగా కేటాయించడం అత్యంత గర్వకారణమన్నారు. కులమతాలు, బేధాలు లేకుండా బడుగు, బలహీన వర్గాల వారికి రాజకీయంగా అబివృద్ధి చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అలాంటి మహా నాయకుడి కోసం గిరిజనులు ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమే అన్నారు. రానున్న ఎన్నికల్లో గిరిజనులు అంత ఏకమై మరోసారి జగన్‌ను సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివశంకర్‌నాయక్, జివిఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శేఖర్‌నాయక్, అగ్రికల్చర్ శాఖ అధికారి, వ్యాపారి ప్రసాద్, గిరిజన సంఘం నాయకులు రంగానాయక్, దశరథ్‌నాయక్, ధనుంజయ నాయక్, మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మిద్దె కూలి వ్యక్తి మృతి

యాడికి : మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో ఆదివారం ఘోరం జరిగింది. పడుకున్న రైతు పాల వెంకటరామిరెడ్డిపై ఇంటి పైకప్పు కూలి మీద పడింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

బొమ్మనహాల్ : మండలంలోని పిడిబ్బ్య క్యాంపులో ఆర్టీసీ బస్సును ఓ ద్విచక్ర వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బళ్లారి నుంచి కళ్యాణదుర్గం వెళ్తున్న ఆర్టీసీ బస్సు పిడిబ్బ్య క్యాంపులో ప్రయాణికులను దింపేందుకు ఆపగా, బళ్లారి నుంచి దేవగిరి గ్రామానికి చెందిన యువకులు ఇద్దరు ద్విచక్ర వాహనంలో వెనుక నుంచి వచ్చి ఢీకొని. దీంతో ద్విచక్ర వాహనంలో వచ్చిన మల్లికార్జునతనతోపాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుత్తి : మండల పరిధిలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాల జిల్లా సంజామలకు చెందిన ప్రేమ్‌కుమార్ గుంతకల్లు పట్టణంలో జరిగే బంధువుల వివాహానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే రజాపురం గ్రామ సమీపంలో గురుకుల పాఠశాల ఎదురుగా వేగంగా వెళ్తున్న ప్రేమ్ కుమార్ మట్టి దిమ్మెను ఢీ కొట్టి బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రేమ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ప్రేమ్‌కుమార్‌ను మెరుగైన చికిత్సకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జైలుకు పీడీ యాక్ట్ నిందితులు

అనంతపురం క్రైం: జిల్లాలో తరచూ నేరాలకు అలవాటు పడిన ఇద్దరు నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించి కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి గాంధీనగర్‌కు చెందిన షేక్ ఖాజా, ఆర్డీటీ కాలనీకి చెందిన పరిమి సోమశేఖర్‌నాయుడు గతంలో పలు నేరాలకు పాల్పడ్డారు. పలువురిపై భౌతిక దాడులకు పాల్పడటంతోపాటు ప్రజాజీవితానికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించడంతో పీడీ యాక్ట్ ప్రయోగించారు. జిల్లాలో ఎవరైనా ఇలాంటి నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా, అశాంతికి గురి చేసినా ఎవరినీ వదలబోమని ఎస్పీ హెచ్చరించారు.

ఎస్‌విఎస్ షోరూం ప్రారంభం

అనంతపురం : స్థానిక బళ్లారి రోడ్డులో సహస్ర రెసిడెన్సీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటసాయి సిరామిక్స్ షోరూంను ప్రారంభించినట్లు నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ జయచంద్ర, రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన హంగులతో, ఆధునిక మోడల్స్ తీసుకురావడానికి ఎస్వీఎస్ సంస్థ కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే బళ్లారి రోడ్డు సమీపంలో ప్రజల ఆదరణతో ముందుకెళ్తున్నామని వివరించారు. విస్తృతమైన, నమ్మకమైన సరికొత్త మోడల్స్‌తో శ్రీవెంకటసాయి సురామిక్స్ సంస్థ రెండవ బ్రాంచిని ప్రారంభించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో శ్రీసాయి బాలాజీ సంస్థ అధినేత దామోదర్, పలువురు పట్టణ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీవెంకటసాయి సిరామిక్స్ షోరూంను ప్రారంభిస్తున్న నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులు

1న 'చలో విజయవాడ'

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నష్టదాయకంగా ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వచ్చేనెల 1న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేసిన పాపానపోలేదన్నారు. ముఖ్యంగా వారంలో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు జిపిఎస్ ఇస్తాననడం సరికాదన్నారు. జిపిఎస్ వద్దని ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీటీఎఫ్ ఉద్యమ నిర్మాత సంగరాజు రామకృష్ణయ్య వర్ధతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు సతీష్‌కుమార్, ఓబులేష్, రమణ, ఖాదర్‌వలీ, నాగభూషణ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై దంపతులకు ప్రశాంతి నిలయంలో ఘనస్వాగతం లభించింది. బెంగళూరు నుంచి ఆదివారం సాయంత్రం 4 గంటలకు గవర్నర్ దంపతులు ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథిగృహానికి చేరుకున్నారు. అక్కడ జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, డిఎస్‌పి వాసుదేవన్, ఆర్డీవో భాగ్యరేఖ, సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, తహశీల్దార్ నవీన్ కుమార్ తదితరులు గోవా గవర్నర్‌కు స్వాగతం పలికారు. పోలీస్ వారి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం గవర్నర్ దంపతులు సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కేరళీయులు జరుపుకుంటున్న ఓనం పండుగ వేడుకల్లో గవర్నర్ దంపతులు పాల్గొన్నారు. కేరళీయులు తమ సాంప్రదాయ దుస్తులు ధరించి పండుగను జరుపుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గవర్నర్ దంపతులు తిరిగి కారులో రోడ్డు మార్గాన కర్నాటక రాష్ట్రంలోని చిక్ బలాపురానికి బయలుదేరి వెళ్లారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జనవిజ్ఞాన వేదిక జోనల్ ప్రధాన కార్యదర్శి ఈటీ రామ్మూర్తి సూచించారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులో ఉన్న అల్ హి లాల్ పాఠశాలలో జెవివి జోనల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతం కావటంపై ఇస్రో శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం దేశానికి ఎంతో గర్వకారణమన్నారు. ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం దేశంలో సూడో సైన్స్ రాజ్యమేలుతోందన్నారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమావేశంలో సంఘం జోనల్ అధ్యక్షులు పి.రామకృష్ణ, వెంకట్రామిరెడ్డి, గంగిరెడ్డిలు మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఉగ్రప్ప, శ్రీనివాసులు, మల్లికార్జున, లక్ష్మీపతి, ప్రభాకర్, పెన్నయ్య, అనిల్ కుమార్, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

నూతన నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ధనాపురం వెంకట్రామిరెడ్డి, గౌరవ సలహాదారుగా న్యాయవాది సిద్ధూ, అధ్యక్షులు పి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా అతావుల్లా, ఉగ్రప్ప, అబ్దుల్‌హక్, ఓబులేశు, గంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈటీ రామ్మూర్తి, కార్యదర్శులు జీఆర్ శ్రీనివాసులు, టీ.లక్ష్మీపతి, ప్రభాకర్, మురళీమోహన్, నాగరాజు, నరసింహులు, సభ్యులను ఎన్నుకున్నారు.